మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 70
పేజీలు : 3

ఆదివారం
28.09.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ






# నెలకు రూ.2వేల స్కాలర్‌షిప్

## ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్

### • ఏటీసీ విద్యార్థులకు సీఎం వరాలు






**టీ మీడియా, సెప్టెంబర్ 27, హైదరాబ్ బ్యూరో :** తెలంగాణలోని యువతీ యువకులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నైపుణ్యత కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు విదేశాల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చిన నేపథ్యంలో మల్లేపల్లి ఐటీఐ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి ముఖ్యమంత్రి గారు రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను విర్చువల్‌గా ప్రారంభించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి గారు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న మల్లేపల్లి ఏటీసీని పరిశీలించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నైపుణ్యం పెంచుకోవడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా 2000 రూపాయల స్టయిఫండ్ ఇస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఇది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. పని చేయాలన్న సంకల్పం కావాలి. కష్టపడి పనిచేయాలి. మీకు ఉద్యోగావకాశాలు, పాస్‌పోర్టు తదితర సర్వీసును అందించడానికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. మీ భవిష్యత్తుకు పునాదులు వేస్తాం.ఏటీసీల్లో శిక్షణ పొందిన తమ్ముళ్లు, చెల్లెళ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడంలో మీ వంతు కృషి చేయాలి. అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతోనే యువతలో సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.రాష్ట్రంలో 1956 లో ప్రారంభమైన ఐటీఐలు, క్రమేణా 65 ఐటీఐలకు పెరిగినప్పటికీ గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదు. మారిన కాలానికి ఈ కేంద్రాలు ఏమాత్రం సంబంధం లేకుండా పాతకాలపు ఒరవడిలో నడిచాయి.వాటిని సమూలంగా మార్చి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నాం. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలో 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడానికి ప్రభుత్వం కేవలం 300 కోట్లు ఖర్చు చేస్తే టాటా సంస్థ 2100 కోట్లు ఖర్చు చేసి ఆధునిక ఏటీసీలను తీర్చిదిద్దారు. మన వద్ద డబ్బుకన్నా ఆలోచన, చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు.ప్రస్తుతం 65 ఏటీసీలకు అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో 51 ఏటీసీలను ప్రారంభిస్తాం. ఈ 116 ఏటీసీలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాయి. ఒకప్పుడు ఐటీఐల్లో చదువుకున్న వారికి ఆర్టీసీలో అప్రెంటిస్ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రెంటిషిప్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలి.రాష్ట్రంలో ప్రతి ఏటా 1 లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందుతున్నప్పటికీ నైపుణ్యం లేని కారణంగా చాలా మందికి ఉద్యోగావకాశాలు రావడం లేదు. నైపుణ్యం లేనిదే ప్రైవేటు కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే స్కిల్స్ పెంచాలన్న అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటివి ప్రారంభించామంటే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నదే మా సంకల్పం.చేతుల్లో డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేకపోతే ప్రయోజనం లేదు. నైపుణ్యత కలిగిన వారికి దక్షిణ కొరియా, జర్మనీ, జపాన్, రష్యా లాంటి దేశాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కేవలం ఐటీ చదివితేనే ఉద్యోగాలొస్తాయన్న అపోహల్లో బతుకుతున్నాం. అది తప్పు. ఏటీసీల్లో చదువుతున్న యువత నైపుణ్యత సాధించడంపై ఫోకస్ పెట్టాలి.చదువు ఒక్కటే సమాజంలో అసమానతలు రూపుమాపుతుంది. మీకు గౌరవం దక్కుతుంది. చదువు, సాంకేతిక నైపుణ్యం ఒక్కటే మీ తలరాతను మార్చుతుంది. ఈ ప్రభుత్వం మీకు అవకాశాలు, వసతులను ఏర్పాటు చేస్తుంది. చదువుకుని రాణించండి. చదువు లేకపోతే, నైపుణ్యం లేకపోతే ఎందుకూ కొరకాకుండా పోతారు.. అని ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారితో పాటు ఉన్నతాధికారులు, టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు, ఏటీసీ విద్యార్థులు హాజరయ్యారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఏటీసీల నుంచి స్థానికంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు.

# అతలాకుతలమైన హైదరాబాద్

## మూసీకి పోటెత్తిన వరద

### • కాలనీలను ముంచెత్తిన వరద





**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబ్ బ్యూరో:** మూసీ ఉగ్రరూపం దాల్చింది. మూసీ, ఈసీ నదుల ఉద్ధృతితో ఒక రోజు రికార్డు స్థాయిలో హైదరాబాద్ జంట జలాశయాలకు వరద పోటెత్తింది. ఇక్కడి నుంచి నీటిని విడుదల చేయడంతో పరివాహక బస్తీలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. చాదర్‌ఘాట్, ముసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి పోటెత్తిన వరదతో రాకపోకలు నిలిచిపోయాయి. మహాత్మాగాంధీ బస్టాండ్‌ను చుట్టుముట్టిన వరదతో అధికారులు బస్సుల రాకపోకలు నిలిపివేశారు.

**జియాగూడ, మూసారాంబాగ్ వరకు వరద ప్రభావం**

హైదరాబాద్‌లో మహానగరంలో సన్నని పాయాలా కనిపించే మూసీ ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాల నుంచి మొదలు గౌరెల్లి వరకు ప్రవాహ ఉద్ధృతితో దర్శనమిచ్చింది. బాపూఘాట్ నుంచి జియాగూడ, మూసారాంబాగ్ వరకు వరద ప్రభావం తీవ్రంగా కనిపించింది.

**నీట మునిగిన ఓఆర్?ఆర్? సర్వీస్ రోడ్డు**

వికారాబాద్, తాండూరు, రంగారెడ్డి జిల్లా శివార్లలో కురిసిన కండపోత వానలకు మూసీ, ఈసీ నదులు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో జంట జలాశయాల నుంచి విడుదల చేసిన నీటితో జియాగూడ నుంచి మంచిరేవుల-నార్సింగి ఓఆర్?ఆర్? సర్వీస్ రోడ్డు వరకు ప్రభావం కనిపించింది. నార్సింగి- మంచిరేవుల వద్ద సర్వీస్ రోడ్ కూడా నీట మునిగింది. దీంతో రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహం : హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు, వంతెనలు, బస్తీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూసీ నదిని

మిగతా 3లో..

# చట్టప్రకారమే ముందుకెళ్లాలి

- తెలంగాణ హైకోర్టు
- బీసీ రిజర్వేషన్ల జీవో విచారణ అక్టోబర్ 8




**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబ్ బ్యూరో :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై చట్టప్రకారమే ముందుకెళ్లాలని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి (రెడ్డి జాగృతి) అనే వ్యక్తి హైకోర్టులో హౌస్? మోషన్? పిటిషన్ దాఖలు చేశారు.

**రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన :** ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ అభినందన్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 42 శాతానికి పెంచారని, దీంతో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60 శాతానికి పైగా వెళుతుందని పిటిషనర్ తరఫు న్యాయవాది మయూర్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని కోర్టుకు తెలిపారు. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతమే ఉండాలనే చట్టం తెలంగాణలో ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

**తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు 69 శాతం :** నూతన జీవో వల్ల రిజర్వేషన్ల పరిమితి 67 శాతానికి చేరిందని, బీసీ రిజర్వేషన్లు 35 శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారని పిటిషనర్? కోర్టుకు తెలిపారు. 2018లో ఇచ్చిన జీవోను ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని గుర్తుచేశారు. తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు 69 శాతానికి పెంచారు కదా? అని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో పెట్టి రిజర్వేషన్ పెంచారని, ప్రస్తుతం అది సుప్రీంకోర్టు విచారణలో ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది హైకోర్టుకు ధర్మాసనానికి తెలిపారు.

**జీవో ఎలా జారీ చేస్తారు?**

పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏను సవరిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేశారని, అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అంశంపై జీవో ఎలా జారీ చేస్తారని హైకోర్టు అడ్వకేట్? జనరల్?ను ప్రశ్నించింది. గవర్నర్ వద్ద పెండింగ్?లో ఉంటే జీవో జారీ చేయొచ్చు అని ఏజీ కోర్టుకు తెలిపారు. అలా జీవో జారీ చేయొచ్చని ఏవైనా తీర్పులు ఉంటే చూపించాలని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది.

**ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగానే :** హైకోర్టు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నిర్ణయం చెప్పేందుకు తమకు రెండ్రోజుల సమయం కావాలని ఏజీ కోరగా న్యాయస్థానం అనుమతిచ్చింది. అక్టోబరు 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా? అని తెలంగాణ ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారణ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

**ఎన్నికల సంఘం సమావేశం:** శనివారం మధ్యాహ్నం స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్?ఈసీ) రాణికుముదినీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు, ఎక్సైజ్ కమిషనర్ తదితరులు హాజరయ్యారు.

## ఎన్నికల ముందు రజనీకాంత్.. తర్వాత గజినీకాంత్

3లో..

## విజయ్ ర్యాలీలో తొక్కిసలాట

- -చిన్నారులు సహా 31మందికి పైగా మృతి!

3లో..

## లోతట్టు ప్రాంతాలలో జాగ్రత్తలు తీసుకోవాలి

సీఎం రేవంత్ రెడ్డి

3లో..

# ఓ వైపు ఆధ్యాత్మికం, మరోవైపు ప్రకృతి సోయగం

## సెలవుల్లో ఈ ప్రాంతాలకు వెళ్లండి



**టి మీడియా, సెప్టెంబర్ 27, ఆదిలాబాద్ :**

ప్రకృతి సోయగాలు అడవి తల్లి అందాలు, జాలువారే జలపాతాలు గలగల పారే నీటి సవ్వళ్లు, చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మికతను వెదజల్లే ఆలయాలు, జోడేఘాట్ పరిసరాలు, కవ్వాల్ అభయారణ్యం ఇలా అనేక అందమైన, ఆహ్లాదకరమైన దృశ్యాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొదవలేదు. కొన్నేళ్లుగా పర్యాటక శాఖ చేపడుతున్న ప్రయత్నాలు కొద్దిగా ఫలిస్తున్నా ఆశించిన ప్రగతి లేదు. పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా సౌకర్యాలను సమకూర్చాల్సిన అవసరం ఉంది. 'నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక కథనం.నిత్యం భక్తులతో రద్దీ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక ప్రాచీన ఆలయాలు ఉన్నాయి. అందులో నిర్మల్ జిల్లాలోని బాసర ఆలయం ప్రసిద్ధి చెందింది. దేశంలో రెండే రెండు సరస్వతీ క్షేత్రాలు ఉన్నాయి. ఒకటి కశ్మీర్?లో ఉండగా, రెండోది బాసరలో ఉంది. పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించేందుకు వేలాది మంది భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. మంచిర్యాల జిల్లాలోని గూడెంలో సత్యనారాణయ స్వామి ఆలయం, జైనథ్?లో లక్ష్మీనారాయణ స్వామి, ఇచ్చోడలో సిరిచెల్మ పోచమ్మ ఆలయం, ఇంద్రవెల్లిలో నాగోబా, దిలావర్?పూర్?లో కదిలి పాపహరేశ్వర ఆలయం, బెల్లంపల్లిలో బుగ్గరాజరాజేశ్వర స్వామి, సారంగాపూర్?లో అడెల్లి పోచమ్మ ఆలయం, చెన్నూరులో అగస్తేశ్వరాలయం, వాంకిడిలోని శివాలయం, ఆసిఫాబాద్?లోని బాలరేశ్వరాలయం, సిర్పూరులోని వేంకటేశ్వర ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటాయి.

**పర్యాటక కారిడార్ :** ప్రభుత్వం హైదరాబాద్ నుంచి నాగ్?పూర్? వరకు పర్యాటక కారిడార్?ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలను కలుపుతూ బాసర మీదుగా నిర్మల్ కొయ్య బొమ్మలు, చారిత్రక కట్టడాలు, కుంటాల, పోచర జలపాతాలు, జైనథ్? సూర్య దేవాలయం వరకు పర్యాటక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. నిర్మల్ మీదుగా కడెం జలాశయం, కవ్వాల్ అభయారణ్యం కూడా దీనికి అనుసంధానం చేస్తే ప్రయోజనం ఉంటుంది.

**ప్రకృతి సోయగాలు :** ఆదిలాబాద్ అంటేనే అడవుల జిల్లా ప్రకృతి అందాలకు కొదవలేదు. మంచిర్యాల జిల్లాలో కవ్వాల్ అభయారణ్యం ఉంది. లేళ్లు, కొమ్ముల దుప్పిలు, అడవి దుప్పిలు, చిరుత పులులు, వివిధ రకాల పక్షులకు ఇది నిలయం. ఈ అభయారణ్యంలో పర్యటించేందుకు వాహన సౌకర్యం ఉంది. దీంతో పాటు శివ్వారం, ప్రాణహిత అభయారణ్యాలు ఉన్నాయి. మొసళ్లు, జింకలు, ఎలుగుబంట్లు, కొండచిలువలు, పెద్దదుప్పిలు, కొమ్ముల దుప్పిలు ఉంటాయి.

**జలపాతాలు :** ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో జలపాతాలు ఉన్నాయి. వీటిలో రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన కుంటాల ఒకటి. ఈ జలపాతం కింద వరకు వెళ్లేందుకు మెట్లు ఉన్నాయి. ఆదిలాబాద్?కు కొద్ది దూరంలో పొచ్చెర జలపాతం ఉంది. ఆసిఫాబాద్ మండల కేంద్రానికి 25 కి.మీ. దూరంలో పచ్చని చెట్లు, ఎత్తయిన గుట్టల మధ్య సమతుల గుండం ఉంది. దీంతో పాటు జైనూర్, సిర్పూరు (యు), నేరడిగొండ అటవీ ప్రాంతాల్లో సప్తగుండాల, పారఖపి, గాయత్రి తదితర జలపాతాలు ఉన్నాయి. వీటికి రవాణా సౌకర్యం కల్పిస్తే ప్రసిద్ధి చెందే అవకాశం ఉంది.

**అద్భుతమైన రాతి కట్టడాలు :** గత వైభవానికి చిహ్నంగా అద్భుతమైన శిల్పకళతో నిర్మించిన అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో నిమ్మనాయుడి పాలన నాటి గొలుసుల దర్వాజ, శ్యంగఢ్, బత్తీస్?గఢ్? కోటలు ఉన్నాయి. ఉట్నూరులో గోండుల కోట ఉంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రాజుల కాలం నాటి నాణేలు, విగ్రహాలు, ఫిరంగులు ఉన్నాయి. అప్పట్లో నిర్మించిన కోనేరులు, రాతి కట్టడాలతో బావులు అక్కడక్కడా కనిపిస్తాయి.

**ఈ ఏడాది థీమ్ :** ప్రపంచవ్యాప్తంగా పర్యాటకంపై అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం ఒక అంశాన్ని ఎంచుకుని కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరం 'పర్యాటకం, సుస్థిర పరివర్తన' అనే థీమ్?తో కార్యక్రమాలు చేపట్టనున్నారు.

## రజకుల సమస్యలపై పుర కమిషనర్‌కు ఫోన్ కాల్

**టీ మీడియా, సెప్టెంబర్ 27, రామకృష్ణాపూర్**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో రజకుల సమస్యల పై శనివారం పుర కమిషనర్ రాజుతో రజక సంఘ నాయకుడు ఫోన్ కాల్ లో మాట్లాడడం జరిగింది.రజకుల ఆరోగ్య సమస్యల గురించి,57 సంవత్సరాలు నిండినవారికి పెన్షన్ కొరకు,మడేలయ్య గుడి కొరకు, దోబీ ఘాట్ కొరకు,చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద పార్కు ఏర్పాటు ఆ ఏరియాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని తెలపడం జరిగింది. ఆర్కెపి నందు ఏ జోన్,బి జోన్ రెండు సంఘాలకు ఒక కమిటీ భవనం అనేది ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది.రజకులకు లాండ్రీ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే సింగరేణి జిఎంతో మడేలయ్య గుడి కోసం ధోబి ఘాట్ కోసం జిఎంకి లెటర్ ఇస్తామన్నారు.చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద పార్కు ఏర్పాటు కోసం,రజకుల ఆరోగ్య సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో శవంపై బంగారం మాయం

- బంధువుల ఆగ్రహం



**టి మీడియా, సెప్టెంబర్ 27, హిందూపురం:**

హిందూపురం పట్టణానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యం అప్పటికే క్షీణించింది. చికిత్స చేసినప్పటికీ పరిస్థితి చేయి దాటి పోయింది. దాంతో రాత్రి 9 గంటల సమయంలో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వృద్ధురాలి కుటుంబసభ్యులు వారి బంధువులకు సమాచారం ఇచ్చేందకు కొందరు హాస్పిటల్? బయటకు రాగా, మరికొంతమంది అంబులెన్స్ కోసం వెళ్లారు. వారంతా తిరిగి వెళ్లే సరికి ఆమె ఒంటి మీద ఉన్న బంగారం మాయమైంది.ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో శవం మీద బంగారం దొంగిలించడం సంచలనంగా మారింది. ఎవరూ లేని ఓ గదిలో వృద్ధురాలి మృతదేహాన్ని ఉంచారు. వైద్య సిబ్బంది, ప్రైవేట్? సెక్యూరిటీ, ఇతర రోగులు అందరూ ఉన్నా ఆమె చెవి కమ్మలను దొంగలించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. తామంతా బాధలో ఉన్న సమయంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణమని బంధువులంటున్నారు. చనిపోయిన వ్యక్తి బంగారానికే భద్రత లేదంటే ఇక ఆ హాస్పిటల్? సెక్యూరిటీ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చంటున్నారు. ఈ ఘటనపై వృద్ధురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.డాక్టర్లు, నర్సులు, ప్రైవేట్ సెక్యూరిటీ, రోగులు, రోగుల సహాయకులు ఉన్నప్పటికీ ఇతర రోగులు లేని ఓ గదిలో మృతి చెందిన వృద్ధురాలి చెవికి ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని మృతిరాలి బంధువులు అంటున్నారు. మృతదేహంపై బంగారు దొంగిలించారంటే ఆసుపత్రిలో భద్రత లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో జాయిన్? చేశాం. రక్త పరీక్షలు అన్ని చేశారు. మధ్యాహ్నం వరకు బాగుంది. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఇక్కడ ఐసీయూ ఫెసిలిటీ లేదు. అనంతపురం తీసుకువెళ్లామని వైద్యులు సూచించారు. ఆమె ఆరోగ్యం గత రెండు రోజుల నుంచి సీరియస్?గా ఉండటంతో అంత దూరం తీసుకెళ్లడం ఎందుకు అని ఇక్కడే ఉంచాం. చనిపోయిందని వైద్యులు నిర్ధారించడంతో అంబులెన్స్ కోసమని బయటకు వెళ్లాం. 10 నిమిషాల తర్వాత వచ్చి చూస్తే చెవి కమ్మలను ఎవరో దొంగలించారు. ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీని అడిగితే మాకు ఏం తెలుసు, పోలీస్ స్టేషన్?కు వెళ్లి కంప్లయింట్? ఇచ్చుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. సాయి కుమార్, మృతురాలి మనుమడు.

## అసాంఘిక కార్య కలాపాలకు అడ్డా

- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అఖిలపక్ష ఐక్యవేదిక

**టీ వీడియా,సెప్టెంబర్ 27, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణం 10, 21 వ వార్డు మధ్యలో ఆగిపోయిన సమీకృత కూరగాయల మార్కెట్ పరిశీలించిన ఐక్యవేదిక సభ్యులు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షులు డా" సతీష్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 21వ వార్డులో ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఈ అభివృద్ధి పనులు కొంత పూర్తి చేశారు. మిగతాది ఆసంపూర్తిగా ఉండి, పిచ్చి మొక్క లు మొలవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, నిర్మాణంలో ఉన్న ఐరన్ కడ్డీలను దొంగలు దొంగలిస్తున్నారని, ప్రజల సొమ్ము దొంగలు, కాంట్రాక్టర్లు దోచుకుపోతున్నారని,రాత్రి అయితే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అంతేకాక ఈ నిర్మాణం పూర్తయితే రోడ్లపై ఉన్న కూరగాయల మార్కెట్ మొత్తాన్ని అక్కడ ఏర్పాటు చేస్తారని ఆశించిన ప్రజలు అవి ఆగిపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు అయిందని, ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం కూడా వాటిని పట్టించుకోకపోవడంతో అక్కడ పిచ్చి మొక్కలు మొలకెత్తి పాములు, తేళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయని అలాగే కందకంలో నీరు నిలిచి ప్రజలు రోగాల పాలు అవుతున్నారని గెలిచిన ప్రజాప్రతినిధులు కనీసం పిచ్చి మొక్కలు కూడా తీపియలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఏ పని కూడా చేయలేని దద్దమ్మలకు రాబోవు ఎలక్షన్లలో మళ్ళీ ఓటు వేస్తారా? ఇది కాంట్రాక్టర్ తప్పు? ప్రభుత్వం తప్పు? వార్డు ప్రజలు గెలిపించుకున్న కౌన్సిలర్ అధినాయకుడి వెంట జిల్లా మొత్తం తిరుగుతాడు కాంట్రాక్టులు చేస్తాడు, కానీ తన వార్డు లో ఉండే సమస్యలను మాత్రం కన్నెత్తి చూడడు. వార్డు ప్రజలు ఫోన్ చేసిన స్పందించడు. ప్రజల బాగోగులు చూడని సన్నాసులను ఓడించాలని సతీష్ యాదవ్ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్ తో పాటు వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, గంధం భరత్, రామస్వామి, కురుమూర్తి, శివకుమార్, కృష్ణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో ఎంత ఘోరం..

## పసిబిడ్డ ప్రాణం తీసిన పాలు!

**టి మీడియా, సెప్టెంబర్ 27, చెన్నై:**

పాలు తాగుతూ నెలన్నర పసిబిడ్డ ఊపిరాడక మృతి చెందడం తీవ్ర విషాదం. ఇలాంటి ప్రమాదాలతో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల మరుగుతున్న పాలలో పడి మరో చిన్నారి మరణించిన సంఘటన కూడా ఉంది. పసిబిడ్డల భద్రతకు ఎల్లప్పుడూ జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం.పిల్లలకు పాలు పట్టించాలి. పాలు తాగితేనే వాళ్లు ఆరోగ్యంగా ఉంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ, ఆ పాలే ఓ పసిబిడ్డ ప్రాణాలు తీశాయి. చెన్నైలో పాలు తాగుతూ నెలన్నర వయసున్న శిశువు ఊపిరాడక మరణించింది. సూర్య (26) చెన్నై సమీపంలోని పూనమల్లి వెల్లవేడు ప్రాంతానికి చెందినవాడు. అతను ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతని భార్య చారులత (23), ఈ దంపతులకు 46 రోజుల క్రితం ఒక మగబిడ్డ పుట్టాడు. సాధారణంగా రాత్రిపూట బిడ్డకు పాలు ఇచ్చేవారు. అలానే శుక్రవారం రాత్రిపూట బిడ్డకు పాలు ఇచ్చి నిద్రపుచ్చారు. కానీ, ఆ బిడ్డ మరుసటి రోజు ఉదయం నిద్రలేవలేదు.ఏంటీ బిడ్డ నిద్ర లేవడం లేదని ఎత్తుకొని నిద్రలేపే ప్రయత్నం చేసినా బిడ్డ కదలకపోవడంతో అంతా షాక్ అయ్యారు. వెంటనే పూనమల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే బిడ్డ చనిపోయాడని చెప్పారు. పాలు తాగుతుండగా ఊపిరాడక చిన్నారి చనిపోయి ఉండవచ్చని వైద్యులు తెలిపారు. దీంతో ఆ దంపతులు ఆసుపత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై వెల్లవేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి ఊపిరాడక చనిపోయిందా లేక మరేదైనా కారణమా అని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మృతదేహాన్ని శవపరీక్ష కోసం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి పంపారు.పాలు తాగుతూ ఊపిరాడక చిన్నారి మృతి చెందడం ఆ గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదిన్నర వయసున్న చిన్నారి మరుగుతున్న పాలలో పడి మృతి చెందిన సంఘటన గురించి తెలిసిందే. పాఠశాలలో పనిచేసే తన తల్లితో కలిసి వచ్చిన ఆ చిన్నారి వంటగదిలోకి వెళ్లింది. పెద్ద పాత్రలో మరుగుతున్న పాలు ఉన్నాయి. ఆ సమయంలో ఆ పాత్ర దగ్గరకు వచ్చిన ఆ చిన్నారి జారిపడి మరుగుతున్న పాల పాత్రలో పడిపోయింది. ఈ ఘటనలో ఆ చిన్నారి విషాదకరంగా మరణించింది. ఈ ఘటనలతో చిన్నపిల్లలు ఉన్న తల్లిదండ్రులు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



## అయ్యో దేవుడా.. కరివేపాకు క్షణాల్లోనే ప్రాణం పోయింది..

**టి మీడియా, సెప్టెంబర్ 27, అనకాపల్లి :**



జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కరవేపాకు కోసేందుకు వెళ్తే క్షణాల్లోనే ప్రాణం పోయింది..! ఓ మహిళ ఇంటి పెరట్లో కొన్ని మొక్కలను పెంచుకుంటోంది.. రోజూ వాటికి నీరు పోస్తూ బాగోగులు చూసుకుంటోంది. అయితే.. అప్పుడప్పుడు అక్కడ పూలు, కాయలు కోస్తూ ఉంటుంది ఆమె. అయితే.. పెరట్లోని కరవేపాకు చెట్టు కూడా ఉంది. ఆ కరివేపాకును కోసేందుకు చెట్టు దగ్గరకు వెళ్లింది. ఏదో కుట్టినట్టు అనిపించింది.. కానీ.. ఏమై ఉంటుందా అనే లోపే.. క్షణాల్లో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కానీ ఫలితం లేదు.. ప్రాణాలు నిలవలేదు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది..

**వివరాల ప్రకారం**

అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం పెద ఉప్పలంలో కుటుంబంతో కలిసి నివాసముంటోంది గుడ్డాటి పార్వతీదేవి.. రోజు మాదిరిగానే పెరట్లో పనులన్ని పూర్తి చేసుకుంది. వంట చేయడానికి సిద్ధమైన పార్వతీదేవి.. పెరట్లో ఉన్న కరవేపాకు చెట్టు దగ్గరకు వెళ్లింది. అక్కడ కరవేపాకును కోసేందుకు సిద్ధమైంది. ఇంతలో ఏదో కుట్టినట్టు అనిపించింది. చూసే సరికి పాము వెళ్ళిపోతు కనిపించింది.. అరుపులు, కేకలు వినిపించేసరికి కుటుంబం సభ్యులు వచ్చారు. అస్వస్థతకు గురైన పార్వతి దేవిని.. హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కుప్పకూలిపోయింది పార్వతీదేవి. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.దీంతో పార్వతీదేవి కుటుంబం తీవ్ర విషాదంలోకి వెళ్ళిపోయింది. కరివేపాకును కోయడానికి వెళ్లి తన భార్య ప్రాణాలు కోల్పోయిందని భర్త శ్రీనివాసరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



## అభయ కనకదుర్గ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

**టీ మీడియా, సెప్టెంబర్ 27, రామకృష్ణాపూర్**

రామకృష్ణాపూర్ లో శరన్నవరాత్రుల్లో భాగంగా అభయ కనకదుర్గ మండపం వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు పాల్గొనడం జరిగింది.కమిటీ సభ్యులు వాళ్లని ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అభయ కనకదుర్గ మండలి కమిటీ సభ్యులు మారపల్లి రాజయ్య, రేణిగుంట్ల పోచయ్య, మాణిక్యాల మల్లేష్, తుంగ వెంకటేష్, రేణిగుంట్ల కొమురయ్య, రేణిగుంట్ల చంద్రయ్య, కన్నూరి బానేష్,ఆరెంధ సతీష్, యూత్ సభ్యులు మారపల్లి సాయికుమార్ ,రేణిగుంట్ల అఖిల్ రేణిగుంట్ల తేజ, రేణిగుంట్ల సుప్రీం, అరేంద శేషు, కవ్వంపల్లి ప్రవీణ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకులకు నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా ,సెప్టెంబర్ 27 ,చిన్నచింతకుంట:**



మహబూబ్ నగర్ జిల్లాదేవరకద్ర నియోజకవర్గం వడ్డేమాన్ గ్రామంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిన్నచింతకుంట మండల ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేసిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూస్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని,బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని,గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలు వివరించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తు చేయాలని, గ్రామ,మండల స్థాయిలో మన వాయిస్ వినిపించాలంటే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలవాలి.కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆయన విమర్శించారు

## ఆర్కేపీలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం

**టీ మీడియా, సెప్టెంబర్ 27, రామకృష్ణాపూర్:**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని రెండో వార్డ్ తిలక్ నగర్ లో శనివారం ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్,వైద్య అధికారి జాహ్నవి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుర కమిషనర్ రాజు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ పుల్లూరి కళ్యాణ్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ కై అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు.ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు.క్షయ వ్యాధి చికిత్స అందిస్తూ,చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 రూపాయల చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆమె తెలిపారు.ఈ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందన,మద్యం సేవించే వారికి,పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఎక్స్ రే అవసరం ఉన్నవారుని మంచిర్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 102 వాహనం ద్వారా తీసుకెళ్లి పరీక్షల నిమిత్తం తిరిగి మరల తీసుకొని రావడం జరుగుతుందని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ చికిత్సలో భాగంగా ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచిందని అన్నారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చెన్నూర్ నియోజకవర్గంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ శిబిరంలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది,సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**టీ మీడియా,సెప్టెంబర్ 27,ఎండపల్లి:**



బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేష్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మండలం లోని రాజారాంపల్లి వివేకానంద కూడలి వద్ద బిఆర్ఎస్ నాయకులు కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి పండ్లు స్వీట్లుపంచిపెట్టారు.ఈ సందర్భంగా గాజుల మల్లేష్ మాట్లాడుతూ.కొండా లక్ష్మణ్ బాపూజీ బడుగు,బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప మహనీయుడని స్వాతంత్ర్య ఉద్యమంలో,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకమైన పాత్ర పోషించారని పౌరహక్కుల ఉద్యమ సత్యాగ్రహంలో,క్విట్ ఇండియా వందేమాతరం ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య కాంక్షను ముందుకు నడిపారని క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఆబిడ్స్ పోస్టాఫీసుపై,కోఠీలో ఉన్న బ్రిటిష్ రెసిడెన్సీపై జాతీయ జెండా ఎగురవేసి సంచలనం సృష్టించారని ఆయన ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకుతెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షులు సింహ చలం జగన్,మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేష్, మారం జగన్ మోహన్ రెడ్డి, రవి భారాస నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరవ రోజు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారి దర్శనం

- మహిళలకు దసరా చీరలు పంపిణి చేసిన సంఘ రమేష్ దంపతులు

**టీ మీడియా,సెప్టెంబర్ 27,ఎండపల్లి:**

దుర్గ దేవి దసరా ఉత్సవాల్లో ఆరవ రోజు లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు దసరాఉత్సవాల్లో ఆరవరోజైన శనివారం దుర్గాదేవిని శ్రీ లలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. మండలం లోని రాజారాంపల్లి గ్రామ జై హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండప నిర్వహకులు దాతల సహకారంతో మహా అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి భక్తులు అయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగ రమేష్ అరుణ దంపతుల చేతులమీదుగా గ్రామ ఆడపడుచులకుఅమ్మవారి పసుపు కుంకుమ గాజులు వస్త్రాలుసుమారు986మందిఆడపడుచులకు దసరా కానుక గా చీరలు పంపిణీ చేశారు. చీరలు స్వీకరించిన మహిళ మణులు సంతోషంతో దుర్గాదేవి ఆశీస్సులు ఎల్లవేళలా అ దంపతుల పై ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిప్రతి శైలేందర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాడి గోపిక జితేందర్ రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు వారికి ఆలయ కమిటీ సభ్యులుతీర్థప్రసాదాలుఅందజేశారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడుపుదరిరమేష్,చంద్రమౌళి,నాయకులు గాజుల విజయ్,సంజీవ్,సుశీల్,లక్ష్మారెడ్డి ఆలయకమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రద్దీగా హైదరాబాద్-విజయవాడ హైవే

- హయత్‌నగర్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబ్ బ్యూరో:** దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లే వారితో హైదరాబాద్?–విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో హయత్?నగర్?లో విజయవాడ హైవేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్? నెలకొంది. ఈ మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతోపాటు ఎల్బీనగర్? నుంచి అబ్దులాపుర్?మెట్? వరకు ట్రాఫిక్? జామ్? పెరిగింది.

**బారికేడ్లు ఏర్పాటు**

మరోవైపు అబ్దులాపుర్?మెట్? మండలం గౌరెల్లి వద్ద వంతెనపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో ఇక్కడ వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గౌరెల్లి వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి స్థానికులను అప్రమత్తం చేశారు. మరోవైపు వర్షాలకు ఉప్పల్? చౌరస్తా వద్ద వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి.

**నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం**



హైదరాబాద్? నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. పలుచోట్ల కురిసిన భారీ వర్షానికి నగర వాసులు తడిసి ముద్దయ్యారు. ఉప్పల్, రామంతాపూర్, చిలుకా నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లు వర్షపు నీటితో జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీటితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘట్ కేసర్ మండలం ప్రతాప్ సింగారం, కొర్రెములలో మూసీ వంతెనపై నుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలో రాకపోకలు నిలిచిపోయాయి.

**దేవరంపల్లిలో పొంగి ప్రవహిస్తున్న వాగు**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దేవరంపల్లి వాగు పొంగి ప్రవహిస్తోంది. గత మూడు రోజులుగా ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈసీ వాగు పొంగి ప్రవహిస్తోంది. మరోవైపు వికారాబాద్? పరిగి మండలంలో కురుస్తున్న వర్షాలకు పెద్దు ఎత్తున నీరు రావడంతో హిమాయత్? సాగరంలో ఇమేజ్? సాగరంలోకి భారీగా వరద నీరు చేరుతుంది. అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల సూచన భారీ వర్షాల దృష్ట్యా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. 'ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని' కోరారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంత జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కృష్ణా, గోదావరిలో వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**అండగా నిలవాలని పవన్? కల్యాణ్ సూచన**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద బాధితులకు అండగా నిలవాలని అభిమానులకు ఏపీ డిప్యూటీ సీఎం, సినీనటుడు పవన్? కల్యాణ్? సూచించారు. జనసేన తెలంగాణ నాయకులు, శ్రేణులకు ఈ నేపథ్యంలో దిశానిర్దేశం చేశారు. వరద బాధితులకు ధైర్యం చెప్పి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. హైదరాబాద్? సహా తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్? మూసీ వరద కారణంగా ఎంజీబీఎస్?తో పాటు పరిసరాలు నీటమునిగాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్?రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రభుత్వ సూచనలు, వాతావరణ హెచ్చరికలను ప్రజలు అనుసరించాలని సూచించారు.



## మండల కేంద్రంలో బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులు

**టీమిడియా ,సెప్టెంబర్ 27, ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ఆత్మకూర్ చౌరస్తాలో హిందూ సంఘాలు చేసిన నిరసనలో ఉద్దేశపూర్వకంగా బిజెపి కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు చేసిన విషయాన్ని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ ఉపాధ్యక్షులు నాగురాం నామాజీ కేసులైన వారిని పరామర్శించి వారి కుటుంబాలకు మనోధైర్యం ఇచ్చారు. తదుపరి గెస్ట్ హౌస్ లో ప్రెస్ మీట్ నిర్వహించి ఆత్మకూర్ నగరంలో వినాయక చవితి సందర్భంగా హిందువులు కాషాయం జండాలు కట్టగా వాటి పక్కన రాత్రికి రాత్రి ముస్లింలు పచ్చ జెండాలు కట్టడాన్ని నిరసిస్తూ ఆత్మకూరు చౌరస్తాలో హిందూ బంధువులు అందరూ పార్టీలకు అతీతంగా నిరసన వ్యక్తం చేయగా కావాలని ఉద్దేశపూర్వకంగా పోలీసు అధికారులు అందులో బిజెపి కార్యకర్తల పై అక్రమ కేసులు చేయటాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది.అక్కడ జరిగిన నిరసనలో హిందువులు అన్ని పార్టీలకు సంబంధించిన వాళ్ళు పాల్గొంటే కేవలం బిజెపి కార్యకర్తలపై కేసులు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు బిజెపి కార్యకర్తలకు కేసులు కొత్త కాదని ఇలాంటి కేసులకు వెనకడుగు వేసేది లేదని ఆ వివాదాన్ని సృష్టించిన అసలైన నిందితులను వదిలిపెట్టి అమాయకమైన చదువుకునే విద్యార్థులపై మరియు బిజెపి కార్యకర్తలపై కేసు చేయడం సమంజసం కాదని నాగురావ్ నామాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్రమంగా చేసిన కేసులను ఎత్తివేయాలని మీడియా ముఖంగా తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి ఉపాధ్యక్షుడు మెరువ రాజు, మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ ,అమరచింత మండల అధ్యక్షురాలు మంగ లావణ్య జిల్లా కౌన్సిల్ నెంబర్లు ఆంజనేయులు ముదిరాజ్, హరీష్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్ , సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్ , సీనియర్ నాయకులు తమ్మలి విజయ్, సూరి , కే ఆనంద్, మాసన్న, ఎల్లన్న , మండల నాయకులు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, యువకులు పాల్గొనడం జరిగింది.

## స్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్



**టీ మీడియా సెప్టెంబర్ 27 చిన్నచింతకుంట :** చిన్న చింతకుంట మండలం లోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం లో మహబూబ్నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేసి శాలవతో సన్మానించినారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటయ్య, లక్ష్మీనరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రియ దర్శిని జూరాల39 గేట్లు ఎత్తివేత

**టీ మీడియా ,సెప్టెంబర్ 27, ఆత్మకూరు :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జూరాల ప్రాజెక్టుకు వరద గంట గంటకు భారీగా పెరుగుతూనే ఉంది. దీంతో కృష్ణమ్మ నది ఉగ్రరూపంతో ఉరకలేస్తుంది.ఎగువన కురుస్తున్న భారీ వర్షలకు ఆల్మట్టి, నారాయణ పూర్ ప్రాజెక్ట్ ల నుండి 3 లక్షల 3 వేల క్యూసెక్కుల భారీ వరద జూరాలకు వరద వచ్చి చేరుతోంది.అప్రమత్తమైన అధికారులు జూరాల ప్రాజెక్ట్ 39 గేట్లు ఎత్తివేసి 3 లక్ష 31 వేల 945 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది, జూరాల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 కాగా, ప్రస్తుత నేటి సామర్థ్యం 8.434 పూర్తిస్థాయి నీటి మట్టం 318.516 గాను, ప్రస్తుత నీటిమట్టం 317.910 ఉంది. ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్స్ లో 195 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి.దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో వరద ప్రవాహం పెరగడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిన అధికారులు. నది తీరా ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, నదివైపు వెళ్లొద్దని అధికారులు సూచించారు.



## శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజి జయంతి

**టీ మీడియా, సెప్టెంబర్ 27, మేడ్చల్:** దుండిగల్ పురపాలక సంఘం కార్యాలయం ప్రాంగణంలో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ చేతుల మీదుగా శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజి జయంతి ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ వి. నాగేశ్ బాబు, మేనేజర్ బి. లక్ష్మయ్య, అలాగే కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మహానేత,శ్రీకొండ లక్ష్మణ్ బాపూజి ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడిగా, తెలంగాణ ఉద్యమానికి అంకితభావంతో సేవలు అందించిన మహనీయుడిగా వక్తలు స్మరించారు.



## పారిశుద్ధ కార్మికులు పై దాడి

**టీ మీడియా, సెప్టెంబర్ 27, మేడ్చల్ :** బహదూర్ పల్లి లో విధి నిర్వహణలో ఉన్న దుండిగల్ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్డుపై చెత్త వేయవద్దని చెప్పినందుకు, చాయ్ కేఫీ యజమాని శ్యామ్ దాడి చేయడం జరిగిందిఈ దాడిలో దుండిగల్ మున్సిపల్ కార్మికులు దుడ్డు సురేందర్, దుడ్డు బాలమణి, కొమ్ము వెంకటమ్మ గాయపడ్డారు.ఈ ఘటనపై దుండిగల్ మున్సిపల్ అధికారులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, గాయపడిన వారిని కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ పరామర్శించారు.



# విమాన టికెట్లతో ప్రైవేట్ ట్రావెల్స్ పోటీ

- మూడు రెట్లు అధికంగా వసూలు

**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబ్ బ్యూరో:** దసరా పండగ వేళ దూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికులకు ప్రైవేటు ట్రావెల్స్? సంస్థలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇష్టానుసారంగా టికెట్ల ధరలను పెంచి, ప్రయాణికుల జేబులకు భారీగా చిల్లు పెడుతున్నారు. దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండగ సమయంలో ఇలా ప్రతి ఏడాది టికెట్ల రేట్లు పెంచుతుంటారు. ఈ పండగ దినాల్లో ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతున్నా రవాణా శాఖ అధికారులు నియంత్రించలేకపోతున్నారు.




**ఆర్టీసీ డిమాండ్? దృష్ట్యా ప్రైవేట్? ట్రావెల్స్**

సామర్థ్య ధ్రువీకరణ, బీమా లేకున్నా, ఇతర నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదుకే పరిమితమై అధిక టికెట్ల ధరలపై చర్యలు తీసుకోవడం లేదు. విజయవాడ, వైజాగ్, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, తిరుపతి ప్రాంతాలకు వెళ్లే రైళ్లు రెండు నెలల క్రితమే నిండిపోయాయి. ఈ పండగ వేళలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నా డిమాండ్? దృష్ట్యా దీన్ని అవకాశంగా తీసుకుని ప్రైవేట్? ట్రావెల్స్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నాయి.

**డిమాండ్ బట్టి ధరల పెంపు**

హైదరాబాద్? నుంచి సొంతూళ్లకు వేళ్లే వారికి అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్సుల్లో టికెట్? ధరలను ముందుగానే ప్రదర్శిస్తారు. కానీ దీనికి భిన్నంగా ప్రైవేట్ ట్రావెల్స్ వ్యవహరిస్తున్నాయి. ఈ డిమాండ్?కు అనుగుణంగా ఎప్పటికప్పుడు టికెట్ల ధరలను పెంచేస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఉండే ధరలకు రెట్టింపు, కొన్నిసార్లు మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నాయి.

**పండగ వెళల్లో రెట్టింపు ఛార్జీలు**

హైదరాబాద్–వైజాగ్‌కు రైలులో థర్డ్ ఏసీ రూ.1,200 వరకు ఉండగా స్లీపర్ బస్సులో రూ.3,200 నుంచి రూ.3,600 వసూలు చేస్తున్నారు. నాన్ ఏసీ బస్సుల్లో రూ.2,000 నుంచి రూ.2,700 మధ్య ధరలున్నాయి. కుటుంబంలో నలుగురికి బస్సులో రానుపోను రూ.20వేల పైనే ఖర్చవుతోంది. నగరం నుంచి కడపకు వెళ్లాలంటే సాధారణ రోజుల్లో రూ.600 ఉంటుంది. పండగ వేళల్లో ఆ ధర దాదాపు రెట్టింపు చేశారు.

**విమాన టికెట్ల ధరలతో పోటీ**

దసరాకు రెండు రోజుల ముందు సొంతూళ్లకు వెళ్లేవారు మూడు రెట్ల వరకు చెల్లించాల్సిందే. అక్టోబరు 1న హైదరాబాద్? నుంచి విశాఖపట్నానికి విమాన టికెట్? ధరలు రూ.4000–రూ.4200 ఉండగా స్లీపర్? బస్సుల్లో రూ.3800 నుంచి రూ.4000 మధ్యలో ఉన్నాయి. సొంత వాహనాలున్న వారు వాటిలో వెళ్తున్నారు. అలాగే రైళ్లు ముందుగానే నిండిపోవడంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముందుగా బుక్? చేసుకున్నా ఇదే పరిస్థితి : ఇలాంటి సమస్యలు తలెత్తున్నాయని మందస్తుగా టికెట్లు బుక్? చేసుకున్నా, చివరి నిమిషంలో బుక్? చేసుకున్నా ఈ అధిక ఛార్జీలు తిప్పలు మాత్రం తప్పడం లేదు. పండగ సమయంలో సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోతుంది. రైళ్లు, ఆర్టీసీ బస్సులు త్వరగా నిండిపోవడం, ప్రయాణికులకు సరిపడా సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్?కు అవకాశంగా మారుతోంది.

**ఆర్టీసీ ప్రత్యేక ఛార్జీలు**

పండుగల వేళ ప్రత్యేక బస్సులు సాధారణ ఛార్జీలపై 50 శాతం వరకు అదనంగా వసూలు చేస్తుందని ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేసింది. దీన్ని ప్రైవేట్? ఏజెన్సీ బస్సులు మరింత ధైర్యంతో ఆర్టీసీ ధరలు పెంచుతుంచే వారు పెంచడంలో తప్పేముందని ప్రైవేట్? ట్రావెల్స్ భావిస్తున్నాయి.

# లోతట్టు ప్రాంతాలలో జాగ్రత్తలు తీసుకోవాలి

## సీఎం రేవంత్ రెడ్డి

**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబ్ బ్యూరో :** రాష్ట్రంలో వర్షాలపై అధికారులను అడిగి సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకున్నారు. మూసీ పరీవాహకం లోని లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మూసీ పరీవాహకంలో వరద పరిస్థితులపై రేవంత్ రెడ్డి ఆరా తీశారు. అవసరమైన చోట పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అర్ధరాత్రి ఎంజీబీఎస్ బస్టాండ్ చుట్టూ నీళ్లు రావటంతో అక్కడున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చేందుకు చేపట్టిన సహాయక చర్యలను సీఎం సమీక్షించారు.



**ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి**

అధికారులతో ఫోన్?లో మాట్లాడి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంజీబీఎస్?కు వచ్చే బస్సులను ప్రత్యామ్నాయ రూట్లకు మళ్లించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ విభాగం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇవాళ కూడా హైదరాబాద్‌లో భారీ వర్ష సూచన ఉన్నందున పోలీస్, ట్రాఫిక్ హైడ్రా, జీహెచ్ఎంసీ, విద్యుత్తు విభాగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. సిటీలో నీళ్లు నిలిచే ప్రాంతాలు, మూసీ ప్రమాదకరంగా ప్రవహించే ప్రాంతాల్లో అధికారులు ప్రజలను హెచ్చరించేలా బోర్డులు పెట్టాలని, అటు వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా దారి మళ్లించాలని అధికారులకు వివరించారు.

**నివాసాలు కూలిపోతాయేమోనని ఆందోళన**

కాశీబుగ్గ, కిషన్‌బాగ్, మేకలమండి, గోశాల ప్రాంతాలను మూసీ వరద ముంచెత్తింది. నివాసాలు కూలిపోతాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**జిల్లాల కలెక్టర్లకు మంత్రి తుమ్మల ఆదేశాలు**

భారీ వర్షాల దృష్ట్యా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీతక్షించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృష్ణా, గోదావరిలో వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరిన మంత్రి తుమ్మల గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**డ్రోన్ ద్వారా ఆహారం పంపిణీ**

మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఎంజీబీఎస్ చేరుకున్న హైడ్రా కమిషనర్ ఎంజీబీఎస్‌లో పరిస్థితిని పరిశీలించారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో వరద ఇళ్లను చుట్టుముట్టింది. మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి అధికారుల సాయం అందిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లోని వారికి ఆహారం పంపిణీ చేస్తున్న అధికారులు మలక్‌పేట పరిధిలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నారు.డ్రోన్ ద్వారా హైడ్రా కమిషనర్ రంగనాథ్, మలక్‌పేట ఎమ్మెల్యే ఆహారం పంపుతున్నారు.

**బాధితులకు అండగా నిలవండి**

హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవాలని అభిమానులకు ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్ కల్యాణ్ సూచించారు. జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వరద బాధితులకు ధైర్యం చెప్పి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. మూసీ వరద కారణంగా ఎంజీబీఎస్‌తో పాటు పరిసరాలు నీటమునిగాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రభుత్వ సూచనలు, వాతావరణ హెచ్చరికలను ప్రజలు అనుసరించాలని పవన్ కల్యాణ్ సూచించారు.

# ఎన్నికల ముందు రజనీకాంత్.. తర్వాత గజినీకాంత్

## రేవంత్‌పై హరీశ్‌రావు మాస్ సెటైర్లు

**టి మీడియా, సెప్టెంబర్ 27,హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క బాండు పేపర్‌పై సంతకాలు పెట్టి ఎన్నికల హామీలు ఇచ్చారని.. కానీ ఎన్నికల హామీలపై ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో



మాట్లాడారు హరీశ్‌రావు.కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతామని చెప్పుకొచ్చారు. బాకీ కార్డు చూపించి ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో కార్మికులు, వ్యవసాయ కార్మికులు సైతం మోసపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి.. ఎన్నికల ముందు రజనీకాంత్.. ఎన్నికల తర్వాత గజినీకాంత్ మాదిరిగా మారిపోయారని ఎద్దేవా చేశారు హరీశ్‌రావు. మినిస్టర్ కాదు.. రేవంత్ రెడ్డి కటింగ్ మాస్టర్ అని సెటైర్లు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్ చేసే పనిలో రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని ఆక్షేపించారు. ఆరు గ్యారెంటీలపై తెలంగాణ అసెంబ్లీలో చర్చిదామంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిపోయారని దెప్పిపొడిచారు. మార్పు మార్పు అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి ఏమార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గల్లీ గల్లీ తిరిగిన గాంధీలు.. ఇప్పుడు ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు ప్రశ్నిస్తారని గాంధీలు హైదరాబాద్‌కు రాకుండా ముఖం చాటేశారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

### విజయ్ ర్యాలీలో...

# తొక్కిసలాట

## చిన్నారులు సహా 31మందికి పైగా మృతి!

**టి మీడియా, సెప్టెంబర్ 27,కరూర్ :** తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకుంది. తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో 31మందికి పైగా మరణించినట్లు తెలుస్తోంది. వీరిలో చిన్నారులతో పాటు పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఇంకా మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను కరూర్‌లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



**సీఎం దిగ్భ్రాంతి**

విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘనటపై సీఎం ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కరూర్ జిల్లా కార్యదర్శి వి.సెంథిల్‌బాలాజీని ఆదేశించారు. కరూర్ నుంచి వచ్చిన సమాచారం తనను ఎంతో ఆవేదనకు గురి చేసిందని, తొక్కిసలాటలో స్పృహతప్పి ఆసుపత్రిలో చేరిన వారికి తక్షణ వైద్య సాయం అందించాల్సిందిగా స్థానిక యంత్రాంగాన్ని కోరామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తెలిపారు.

# అతలాకుతలమైన హైదరాబాద్

ఆనుకుని ఉన్న మూసానగర్, రసూల్ పూర, వినాయకవీధి, శంకర్ నగర్, గోల్నాక పరిధిలోని ఇళ్లు నీట మునిగాయి. ముందు జాగ్రత్తగా ముంపు ప్రాంతాల్లో ఉన్న 600 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాదర్ ఘాట్, ముసారాంబాగ్ వంతెనలపై వాహన రాకపోకలను నిలిపేశారు. మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహిస్తోంది.

**వస్తువులన్నీ తడిచిపోయాయని ఆవేదన :** కాశీబుగ్గ, కిషన్‌బాగ్, మేకలమండి, గోశాల ప్రాంతాలను వరద ముంచెత్తింది. మూసారాంబాగ్ బ్రిడ్జి సమీపంలో 5 కార్లు, ట్రావెల్స్ బస్సు నీట మునిగాయి. ముంపు దృష్ట్యా పునరావాస శిబిరాలకు తరలించడంతో కార్లు, వాహనాలను వదిలేసి శిబిరాలకు వెళ్లిపోయారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు. ఏటా మూసీ వరద వెతలు తప్పడంలేదని స్థానికులు వాపోయారు. ఇంట్లో నిత్యావసరాలు సహా వస్తువులన్నీ తడిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.పురానాపూల్ వద్ద 13 అడుగుల మేర మూసీ ప్రవాహం కొనసాగింది. వరద ఉద్ధృతిలో శివాలయంలో పూజారి కుటుంబం చిక్కుకుంది. వరదలో చిక్కుకున్న నలుగురిని భారీ క్రెయిన్ సహాయంతో కాపాడారు.

**ప్రయాణికులను తరలింపు :** నిత్యం వేలాది ప్రయాణికులతో రద్దీగా ఉండే మహాత్మాగాంధీ బస్టాండ్‌ను మూసీ వరద చుట్టుముట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రయాణికుల ప్రాంగణాన్ని తాత్కాలికంగా మూసివేశారు. అప్రమత్తమైన యంత్రాగం ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బస్సులను లోనికి అనుమతించడం లేదని వెల్లడించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను ఎల్బీ నగర్, ఉప్పల్ స్టేషన్?లకు తరలిస్తున్నట్లు తెలిపారు.

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన**

మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఎంజీబీఎస్ చేరుకున్న హైడ్రా కమిషనర్ ఎంజీబీఎస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో వరద ఇళ్లను చుట్టుముట్టింది. మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి అధికారుల సాయం అందించారు. ముంపు ప్రాంతాల్లోని వారికి ఆహారం పంపిణీ చేస్తున్న అధికారులు మలక్‌పేట పరిధిలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు.